# "వ్రతం చెడ్డా సుఖం దక్కాలి"...

రచన: తంగిరాల హనుమంతరావు 'పరదేశి'



పన్నెండు సంవత్సరాల బండచాకిరి "గుమాస్తాగిరి" ఫలితంగా, యీనాటికి ఒక అసిస్టంటు అకౌంటెంటు కాగలిగాడు కామేశ్వరరావు. పదవితోపాటు, పది రూకలు జాస్తిగానే ముటుతున్నాయి యిప్పుడు. కానీ, సంవత్సర, సంవత్సరానికి పెరిగిపోతుండే సంసారంతో, నిమిష నిమిషానికి చంద్రమండలాన్ని చుంబించబోతున్న ధరలతో పేరుకు రెండు వందలైనా, కడుపులోని పేగులు పూర్తిగా తృప్తిజెందకుండా వున్నాయి. పైగా పురుళ్ళు, పుణ్యాలు, తద్దినాలు, మాసికాలు, ఒకటేమిటి అన్ని ప్రపంచ చిత్రాలకు ఆదుకోవాల్సిన చెయ్యి తన ఒక్కడిదే.

పోయిన సంవత్సరాంతంలో, భార్యకు జబ్బు, తనకు టైఫాయిడు, పెద్దకుర్రాడికి కామెర్లు, చిన్నవాడికి పాసనాలు, ఒకటేమిటి ఆర్థికంగా ఎన్ని యిక్కట్లు అనుభవించాలో అన్నీ అనుభవించాడు పాపం. యిప్పటికే దాదాపు వెయ్యి రూపాయలై కూర్చుంది ఆసామీదగ్గర అప్పు. తలయెత్తి తిరగలేకపోతున్నాడు అసలే. అందుకుతోడు మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్టు "ముహుర్తాలు మించిపోతున్నాయి, పెద్దమ్మాయికి కార్యంచేసి పంపుతారా లేదా" అంటూ పీకలమీద కూచున్నారు వియ్యాలవారు. యీ ఘటనాప్రవాహాలకు ఎలా ఎదురీదడం—? పోనీ, ఆస్తో, పాస్తో వుంటే తెగనమ్మి చేతులు కడుగుకోవచ్చు. కానీ, తన దగ్గిర అలాంటి మీమాంసాలకు తావే లేకపోయె. "తాతలనాటి చిప్ప తరతరాలకు" అన్నట్టు తన తండ్రి వెంకటేశంగారు, అదే తనకూ ఒప్పజెప్పి కాలగర్భంలో కలిసిపోయాడు: యింటర్మీడియట్ వరకూ చెప్పించిన చదువుతప్ప, మరి చెప్పుకోదగ్గ ఆస్తి అంటూ లేదు. పోనీ యీ ఆపత్కాలంలో, తండ్రైనా బతికివుంటే తనకిన్ని అగచాట్లు పట్టేవికావు అనుకొనేవాడు పాపం. అదృష్టలిపిలోని ఆ చిహ్నంకూడా అదృశ్యమయిపోయె. దగ్గర బంధువులూ, చుట్టాలూ, యీ కష్టసమయంలో ఆదుకునేవారుంటే ఎంత బాగుండు అని అనుకున్నప్పుడల్లా 'నీ మొహానికి అలాంటివారు కూడనా' అన్న సమాధానం వెంటనే వినిపించేది మనస్సులోంచి. ఆఖరుకు, 'ఎవరిఅదృష్టానికి వారేకర్తలు భర్తలు" అన్న సిద్ధాంతానికి రాక తప్పింది కాదు. తన పరిస్థితులను తను చక్కచేసుకోకపోతే మరెవరొస్తారు మనల్ని వెతుక్కుంటూ?

కానీ, చూద్దాం? యింతకన్నా జాస్తి జీతం దొరికే వుద్యోగం సంపాయిద్దామనుకున్నాడు - ప్రయత్నించాడు కూడా? కానీ ఫలితం 'న' కారాన్నే ఆహ్వానించింది. హేమాహేమీల్లా మూడేసి బారల డిగ్రీలు తగిలించుకున్నవారే కూచోని రామభజన చేస్తుంటే, 'సముద్రంలో కాకిరెట్ట'లా వున్న తనకు దొరకడం మాటలే? ఆఖరుకు ఆ ఆశను కూడా నిరాశ కబళించింది. అయినా ప్రపంచంలో ఎంత డబ్బుంది. అబ్బబ్బ లెక్కలేనంత కోట్లకు కోట్లు—అందులోని, ముప్పాతిక మువ్వీసపు భాగంలో, ముప్పైఫయోవంతు తనకు లభించినా, యీతగాడు నదీ ప్రవాహాన్ని సులభంగా దాటి గట్టుచేరుకొని ఒళ్ళు తుడుచుకొన్నట్టు తనూ నిశ్చింతగా నిద్రపోవచ్చు. కానీ, ఆ చంచలలక్ష్మి ఎగిరి తన కోటుజేబులో పడడం ఎలా కుదురుతుంది. యింతకన్నా కష్టపడి పనిచేసివుంటే ప్రమోషన్లు తొందరగా దొరికేవేమో? అని కూడా అనుకునేవాడు పాపం. కానీ అవన్నీ గతించిన గాథలు. ప్రస్తుతానికి పనికొచ్చే వుపాయం ఏదీ మెదడును స్పృశించటంలేదు. గాలిలో ఎగిరే ఆకులావుంది కామేశ్వరరావు మనస్సు.

ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోతోంది. చేసేపనిలో లెఖలేనన్ని తప్పులు తెలేకుండానే తొంగిచూస్తున్నాయి. 30 రాయాల్సిన చోట '0' లోపించడం, 40 రాయవల్సిన చోట '4' అదృశ్యంకావటం యిలాంటివే ఎంత బంధించినా పగ్గాలులేని మనస్సు పరిపరివిధాలా పోతోంది. ఒకనాడు పిలిపించేడు మేనేజరు; హెచ్చరించాడు తన తప్పులను దిద్దుకోమని—"జాగ్రత్తగా పనిచేసుకోండి కామేశ్వరరావుగారూ లేకపోతే......!" అంటూ వదిలేశాడు వాక్యాన్ని. యీ ఆఖరి వాక్యం వినడంతోనే కండ్లకు మైకం కమ్మి

నట్లయింది పాపం. "లేకపోతే" అన్న ముక్క గింగురుమంటుంది చెవుల్లో-పన్నెండు సంవత్సరాలనుంచి, అవినా భావసంబంధం గలిగిన అంకెలే తన్నింత అవమానానికి పాలుజేస్తున్నాయి. వెధవ అంకెలు ఎన్నికోట్లు కూడుంటాను. ఎంతచేసినా నౌకరి, నౌకరే. పాత పందికొక్కునైనా ఆలోచించకుండా అమాంతం ఎంతమాట మాట్లాడేడు ఆ మేనేజరు. ఛీ వెధవవుద్యోగం బ్రతంచెడ్డా సుఖం దక్కకుండా వుంది. మరి వుద్యోగంకూడా ఏం లాభం లేదనుకున్నాడు.

ఇలాంటప్పుడే మెరిసింది ఒక మెరుపు— 'బ్రేయిన్ వేవ్'. ఎక్కడ దాగి దోబూచులాడుతుణ్ణిందో యిన్ని రోజులనుంచి ఏమి "ఐడియా"—నివురుగప్పిన నిప్పులా యింత తెలివీ తనలోనే యిమిడివుంటే — ఎందుకు నేనీ అవస్థలన్నీ పడటం అనుకుంటూ తన తెలివికి తనే నవ్వుకున్నాడిప్పుడు—మరి ఆలోచనను కార్యరూపంలోకి దించడమే తరువాయి. అదేమి వింతో? యీవూహ ఉత్పత్తిఅవటంతోనే, మనస్సులోని కలవరం వేగిరపాటు చెయ్యిపెట్టి అవతలకి నెట్టేసినట్లనిపించింది. యింకెన్నిరోజులు పదిహేను. కళ్ళుమూసుకుంటే గడిచిపోతాయి. తర్వాతనా ఓహ్???

ఆఫీసుపని ద్విగుణీకృతోత్సాహంతో జరిగిపోతూంది, కామేశ్వరరావుగారి చేతులమీదిగుండా. మేనేజరుగారిదగ్గర పూర్వపు ఆదరాభిమానాలను తిరిగి సంపాదించుకోడానికి బహుతీవ్రంగా సల్పుతున్నాడు కృషి. ఎంతచేసినా మరి పదిహేను రోజులేగా, అన్న ముక్క మరింత మనోధైర్యాన్ని బలపరుస్తుంది. రోజులెంతలో గడవాలి మరి అయిదు రోజులు వేసిన ప్లాను, తట్టినవూహ, చెయ్యదలచిన పని, అన్నీ చిన్నవే, బహు స్వల్పమయినవే, కానీ మెదడుకు సంబంధించినవి. అదే అక్కడున్న కీలకం. మరి మూడురోజులు వ్యవధి వుంది ఆ శుభదినానికి. "అత్తకత్త" గారి కటాక్షం కలిగితే, "నారికేళ సలిలము భంగిన్" లాగే యింటికింట్లోనే వూరిపోతుందట డబ్బు. అలాగే ప్రకృతికూడా తన తెలివైన పన్నుగడకు దోహదం యిస్తున్నట్లు కన్పించింది. ఒకటో తారీకు ఆ శుభదినం. అచ్చంగా ఆదివారమై కూచుంది. యిదీ తన మంచికే అలా అనుకున్నాడు. అనుకున్నాడేమిటి అనిపించింది. కాబట్టి 30 యో తారీకుకే అందిపోతాయి జీతపురాళ్ళు.

ప్రతినెల జీతాలచెక్కు బ్యాంకికి తీసుకెళ్ళి డబ్బుచేసుకురావడం, గతించిన యీ పుష్కరాన్నుంచి తన విధ్యుక్తధర్మమై కూచుంది. ఆపని తనకే కేటాయించబడింది. ఆపని తనే చేసేవాడు కూడా. ఒకటేమిటి బోలెడన్ని చెక్కులు, హుండీలు, బిల్లులు, స్వంతఖాతాలో జమాచెక్కులు అన్నీ తనకే వప్పగించేవారు ఆఫీసువాళ్ళు. వీటి నన్నిటిని బ్యాంకికి చేర్చేముందు మేనేజరుగారి సంతకాలు కావాలి. ఆపనీ తనదే. ఆ తిరుమంత్రార్థమంతా యిక్కడే వుంది. అంటే ఇదే ఆయువుపట్టు. ఈ అమూల్యఅవసరాన్నే వినియోగించుకోవాలి. దీనితోనే తన అభీష్టాన్ని నెరవేర్చుకోవాలి. మేనేజరుగారు అనుకున్నట్టు "కాల్" చేశారు కామేశ్వరరావుని. అన్నికాగితాలు బహు జాగ్రతగా సర్దుకుంటూ అడుగువేశేరు ఆఫీసులోకి. చకచకా సంతకాలు పెట్టేస్తున్నారు మేనేజరుగారు. యింటినుంచి వచ్చింది పిలుపు. అమ్మగారు త్వరగా రమ్మంటున్నారంటూ — ఆ తొందరలో పాపం మేనేజరుగారు గ్రహింపలేకపోయారు, అన్నిచెక్కులమధ్య బ్లాంక్ చెక్కొకటుందని "గుడ్డెద్దు చేలోపడ్డట్టు" పెట్టేశాడు సంతకాలు.

ఇంకేం? కామేశ్వరరావుగారిఅభీష్టం నెరవేరింది. కాగితాలన్నీ కలవేసి గబగబా వచ్చేశాడు బయటికి. తిన్నగా తన టేబిల్ దగ్గరికొచ్చాడు. ఒకవైపు గుండెలు గబగబాకొట్టుకుంటూనే వున్నాయి. అయితే ఏం ముందున్న మంచిరోజులను తల్చుకునేసరికి నూతనోత్సాహము బయలుదేరింది. మరి యీ చెక్కుమీద ఎంత మొత్తం ఎక్కించడం, ఎదురైంది ఒక సమస్య—మనస్సు పదివేలు ఎక్కించమంది చేతులు తోడిచ్చాయి పడిపోయింది సంఖ్య రూ 10,000/- లు అంటూ. రాశిన తర్వాత పశ్చాత్తాపం అయ్యోయ్యో మరో అయిదు వేలు కలిపి పదిహేను రాసుంటే. చెక్కు మన చేతిలోవుంటే మించిపోయిందేమిటి? అనుకుంటా చూచాడు గడియారంవైపు 2-30 అయింది. అరెరే అయిపోతుంది టైమ్. మరి అరగంటేవుంది అనుకుంటూ మళ్ళీ చూచాడు చెక్కువైపు. కానీ తొందర, పడిపోయింది అక్షరాల్లో "పదిహేను వేలు మాత్రమే" అంటూ.

మరుక్షణంలో బ్యాంకి కౌంటరుదగ్గర కనిపించారు కామేశ్వరరావు. యింకా కొంతమంది పెద్దమనుష్యులు కాచుక్కూచున్నారు. తనూ నిలబడ్డాడోవైపు. మళ్ళ మొదలు ఆలోచన "యింకేం మనకు అప్పులవాళ్ళ అప్పు రెండు క్షణాల్లో ఫైసలైపోతుంది. తర్వాతనా భార్యాబిడ్డలను ఎక్కించెయ్యాలి మెయిలు రాత్రికి. మరి వాళ్ళిక్కడ వుండకూడదు. అంతవరకూ పుట్టింట్లోనే వుండాలి తప్పదు. తనో, ఏ లాహోరో, కరాచో. అక్కడో చిన్నవ్యాపారం క్రమక్రమంగా కొంచెం పెద్దదయితే యీ సమాచారం అప్పటికి కాలగర్భంలో కలిసిపోతే తర్వాత భార్యాబిడ్డలను పిలిపించుకొని హాయిగా కాలక్షేపం చెయ్యవచ్చు" ఇంతలో జనం పలచబడ్డారు. చిరపరిచితుడైన క్యాషియర్ గారి పిలుపు కామేశ్వరరావును కౌంటరుదగ్గరకు లాగింది. అన్నిచెక్కులూ ఆయన చేతిలో పెట్టాడు. ఒక్కటొక్కటే చూస్తున్నారు క్యాషియారు. ఎప్పుడూ లేంది ఆయనకూ ఆరోజే ఎందుకో వేసింది అనుమానం, ఆ చెక్కును చూడంగానే ఆచెక్కుతో నెమ్మదిగా బ్యాంకిమేనేజరుగారి ఆఫీసులోకి ప్రవేశించారు క్యాషియరు.

ఇదంతా చూస్తున్నా కామేశ్వరరావుగారు చలించలేదు. ఏమిటో అనుకున్నారే తప్ప పాపం ఆయన ఆలోచనలు మరి దేనిమీదికి మనస్సును పంపలేకపోయాయి.

అక్కడ మేనేజరుగారు చెక్కు చూడంగానే వులిక్కిపడ్డారు. వెంటనే ఎత్తారు ఫోను జవాబొచ్చింది. మేనేజరుగారు ఆఫీసులో లేరు. మళ్ళ కలిపారు యింటినెంబరు 'హల్లో యింపీరియల్ బ్యాంకినుంచి మాట్లాడుతున్నాను.'.

"ఏమిటి సంగతి"

"అక్షరాల్లో పదిహేను వేలు, అంకెల్లో పదివేలు రాశిపంపిన మీచెక్కును నేనెందుకు 'కన్ఫిస్కేట్' చెయ్యగూడదండీ?

యీమాట వినడంతోటే మేనేజరుగారి బుర్ర గిర్రుమనిపించింది. వెంటనే పోలీసులకు వార్త—మరుక్షణం లారీ ఆగింది యింటిముందు. మూడో నిమిషంలో 'యింపీరియల్ బ్యాంక్ ఆఫ్ యిండియా'

కామేశ్వరరావుగారు పాపం వారి వూహాసౌధాల సంభ్రమంలో ఆ ఆలోచనల ఆనందంలో, అలాగే నిల్చొనున్నారు కౌంటరు దగ్గిర. సబ్ యిన్స్పెక్టర్ రామారావుగారి చెయ్యి భుజంమీద, కాన్స్టేబిల్ అప్పలస్వామిచేతులు, చేతులమీద పడినంతవరకూ, తెలుసుకోలేకపోయారు అసలు విషయమేమిటా అని—.